క్లుప్తంగా

సమయ శ్లోక యంత్రం ప్రారంభం



కొత్తపల్లి: మండలంలోని నిడ్జింత కోట మైసమ్మ ఆలయంలో హిందూ ముదిరాజ్ సంఘ సభ్యుల సహకారంతో శుక్రవారం భగవద్గీత శ్లోకం చెప్పే హిందూ టెంపుల్ బెల్ క్లాక్‌ను ప్రారంభించారు. ఇది ప్రతి గంటకు భగవద్గీతలోని ఒక శ్లోకం చెప్తుంది. ఈ పరికరం ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేస్తుంది. ఉదయం సుప్రభాతంతో శుభోదయం చెప్తుంది. ఏ రోజుకు సంబంధించిన భగవంతుడి పాటను ఆ రోజుకు మూడు సార్లు పాడుతుంది. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు అంజిలప్ప, విజయ్ కుమార్, వెంకట్‌రాములు, జగ్గప్ప, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు పండుగ బోనస్



నారాయణపేట: పౌరసరఫరాల శాఖలో పని చేసే హమాలీలకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ ఎస్ శ్రీను తెలిపారు. దసరా పండుగ సందర్భంగా శుక్రవారం జిల్లా పౌర సరఫరాల సంస్థలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తున్న 36 మంది హమాలీలకు ఒక్కొక్కరికి రూ.7,500 బోనస్, యూనిఫాం బట్ట, రూ.900 స్వీట్ అలవెన్స్ పంపిణీ చేశారు. ఆయనతో పాటు సివిల్ సప్లయ్ డీఎం సైదులు ఉన్నారు.

క్రీడాకారులకు జెర్సీల అందజేత



మరికల్: నారాయణపేట జిల్లా నుంచి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ కరస్పాడెంట్ దండు రాములు శుక్రవారం క్రీడా దుస్తులను అందజేశారు. బాల, బాలికలకు కిట్లు కూడా అందించారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సురేష్, మహేందర్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మక్తల్: వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసి సగరులు తమ సత్తా ఏంటో చూపించాలని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ అన్నారు. శుక్రవారం మక్తల్‌లో నిర్వహించిన సగరుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి ఎంపీటీసీలు, సర్పంచ్ అభ్యర్థులుగా పోటీ చేయాలని సూచించారు. బీసీ కుల సంఘాలతో మాట్లాడి పరస్పర సహకారంతో ముందుకు సాగాలన్నారు. అందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని కోరారు. అక్టోబర్ 12న జిల్లా సర్వసభ సమావేశం నిర్వహించిన అనంతరం నూతన కార్యవర్గాన్ని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ముత్యా హరికిషన్, ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, హన్మంత్, అంజనేయులు, అనంతప్రసాద్, శేఖర్, రామకృష్ణ, వంకర మహేష్‌సాగర్ రామపురం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాస ఉత్సవాలు



ఊట్కూరు: మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణమాస ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు పౌష్టికాహారం వంటకాలను ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, కానుకలను అందించారు. అనంతరం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, సీడీపీఓ జయ, సూపర్‌వైజర్లు గీత, రాజేశ్వరి, అంజలి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటేశ్వరమ్మ, జ్యోతి, జయదేవి, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి అమ్మవారిగా దర్శనం



కోటకొండ వాసవిమాత ఆలయంలో..



మద్దూర్‌లో..



నారాయణపేట అంబాభవాని ఆలయంలో..



నారాయణపేట మలలాంబిక ఆలయంలో..



భూనీడులో..



కోస్గిలో అమ్మవారి కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఆలయాలు, మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతో పాటు మహిళలు కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

■ నారాయణపేట జిల్లా కేంద్రంలోని మలలాంబిక ఆలయంలో అమ్మవారు కొల్లాపూర్ మహాలక్ష్మి దేవిగా, అంబభవాని ఆలయం, గజలేశ్వరి ఆలయంలో మహాలక్ష్మి దేవిగా, శక్తిపీఠంలో లలితా త్రిపురసుందరి దేవిగా, పళ్ల హనుమాన్ మందిరంలో మహా చండీ దేవిగా దర్శనమిచ్చారు. శ్రీసంత్ మత మూల మహాసంస్థానం శక్తి పీఠంలో అమ్మవారిని తెలుగు సీరియల్ నటి శిరీష దర్శించుకొని, పూజలు చేశారు. అనంతరం సురభి గోశాలను సందర్శించారు. తదనంతరం సాయంత్రం 5 గంటలకు సామూహిక కుంకుమార్చన చేశారు. అదే విధంగా సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించారు.



సింగారం దుర్గాదేవి మండపంలో..

■ నారాయణపేట మండలంలోని కోటకొండ మారుతీనగర్ మల్లికార్జునస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. రూ. 2,16,516 కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి రూ.11,11,111 నోట్లతో అలంకరించారు. సింగారం శ్రీహరిపీఠంపై అమ్మవారికి కరెన్సీ నోట్లతో అలంకరించి లక్ష్మీదేవతగా దర్శనమిచ్చారు.

■ మద్దూరు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనిమిచ్చారు. కటకం శ్రీనివాసులు, అరుణ దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు శంభునీ నర్సింహులు, నాగులు, భీమాశంకర్, రాము, రమేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

■ కోస్గి పట్టణంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర శివసాయి అయ్యప్ప ఆలయాల ప్రాంగణంలో, మున్నూర్ వీధి విజయ గణపతి మండపంలో, హరిజన వీధిలో అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అలంకరించి పూజలు చేశారు.

■ దామరగిద్ద మండలంలోని భవాని ఆలయంలో కుంకుమార్చన మంగళహారతి పూజలు చేపట్టారు.

■ కొత్తపల్లి మండలంలోని భూనీడులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి రూ.5,05,055 నోట్లతో అలంకరించారు. కార్యక్రమంలో హన్మంతు యాదవ్, హన్మంతురెడ్డి, సత్యయాదవ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత.. ప్రయాణానికి చింత

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారుల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పాతబస్టాండ్ నుంచి కూరగాయాల మార్కెట్, పళ్లకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. ముఖ్యంగా స్థానిక శ్రీవేద సరస్వతి జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పళ్లకు వెళ్లే దారిలోనే ఉండడంతో నిత్యం ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల గణేష్ ఉత్సవాల సమయంలో రోడ్లపై ఉన్న గుంతలను తాత్కాలింగా బాగు చేసినా.. నెల కూడా తిరగకుండానే వర్షాలకు మరల గుంతలు ఏర్పడుతున్నాయి. కావునా రోడ్లపై ఉన్న గుంతలను శాశ్వతంగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



పళ్లకు వెళ్లే దారిలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

బీజేపీతోనే వ్యవసాయ సంక్షోభం



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: వ్యవసాయ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ నెల 30న నిర్వహించనున్న జిల్లా సదస్సును విజయవంతం చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి రాము పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో కలిసి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ విధానాల వల్ల వ్యవసాయరంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని, కనీస మద్దతు ధరలు ఎక్కడ అమలు జరగడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 60 లక్షల కుటుంబాలు వ్యవసాయ రంగంలో ఉపాధి పొందుతున్నాయని పేర్కొన్నారు. రైతు ఆత్మహత్యలను నివారించి, పత్తి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, యాదగిరి, అంజయ్య, కాశీనాథ్, గోపాల్, బలరాం, నరసింహ, నారాయణ, ప్రశాంత్, వెంకట్ రాములు, శివప్ప, అంజి, నరసింహులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



సింగార్‌బేస్ హనుమాన్ ఆలయం వద్ద బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

నారాయణపేట రూరల్: తెలంగాణ సంస్కృతి సాంప్రదాయమైన బతుకమ్మ సంబరాలను నలు దిశలో చాటాలని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సంస్కారభారతి జిల్లా అధ్యక్షురాలు జోషిహారతి గోపాలచారి అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పట్టణంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ వీధులకు చెందిన మహిళలు, యువతులు పూలతో బతుకమ్మలను అందంగా తయారు చేశారు. బతుకమ్మ పాటలకు ఆడిపాడారు. అనంతరం ఉత్తమ బతుకమ్మ అలంకరణ చేసిన మహిళలకు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేష్ దేశాయి, సంగ నర్సింహులు, శ్రీకాంత్, రామకృష్ణ, ప్రభాకర్, వసంత్, కృష్ణ, భారతి, స్వాతి పాల్గొన్నారు. పట్టణంలోని సింగార్‌బేస్ హనుమాన్ ఆలయం వద్ద శుక్రవారం రాత్రి మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

గుడెబల్లూర్‌లో..

కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకకు హాజరైన మహిళలకు గ్రామ పెద్దలు బహుమతులు అందించారు.



జిల్లాకేంద్రంలో సంస్కారభారతి ఆధ్వర్యంలో..



ఊట్కూరులో బతుకమ్మ వేడుకల్లో సీడీపీఓ, అంగన్‌వాడీ టీచర్లు

నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలి

ఊట్కూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ తగ్గింపు మేరకు నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని శుక్రవారం సామాజిక కార్యకర్త మహేష్‌గౌడ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం జీఎస్టీని తగ్గించిన వ్యాపారస్తులు వస్తువుల ధరలను తగ్గించలేదని ఆరోపించారు. పలు దుకాణాల్లో కొత్త స్టాక్ రాలేదని చెప్తుతూ పాత ధరలతో వస్తువులను విక్రయిస్తున్నారని ఆరోపించారు. వ్యాపారస్తులు వస్తువుల రేట్లు తగ్గించకపోవడంతో సామాన్య ప్రజలు నష్టపోతున్నారని, ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని జీఎస్టీ తగ్గింపు మేరకు వస్తువులను విక్రయించేందుకు పాటు పడాలని కోరారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి



మాగనూర్: మండలంలోని అమ్మపల్లి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద దూలపోళ్ల కుర్వ సాబెన్నకు చెందిన 4 గొర్రెలు శుక్రవారం మేత మేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. అధికారులు స్పందించి బాధితుడి నష్ట పరిహారం అందించాలని కోరారు. విద్యుత్ అధికారులకు కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు.

జిల్లాకు ప్రత్యేక నిధులు

కృష్ణా: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన అస్పిరెంట్స్ జిల్లాల జాబితాలో నారాయణపేట జిల్లా ఉండడంతో ఆరేళ్ల పాటు వ్యవసాయ రంగానికి ప్రత్యేక నిధులు అందించనుందని ఉమ్మడి మాగనూర్, కృష్ణా మండలాల బీజేపీ ప్రధానకార్యదర్శి అశోక్‌గౌడ్ అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు, పరికరాలు, ఆధునీకరణకు అవసరమయ్యే నిధులు మన జిల్లాకు రానుండడంతో కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన ఈ జిల్లా వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు భరత్, శ్రీపాద్, కార్తీక్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల నూతన కమిటీ

నారాయణపేట రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఉద్యోగుల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణానికి చెందిన లయన్స్ క్లబ్ ఫాస్ట్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్‌ను సంఘం గౌరవ అధ్యక్షుడిగా నియమించారు. కమిటీ నూతన అధ్యక్షుడి బోయ వెంకట్రాములు, కార్యదర్శిగా నాగేందర్, కోశాధికారిగా ఆర్.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హరినారాయణ బట్టడ్ మాట్లాడుతూ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. పెన్షన్, రేషన్ కార్డ్ వంటి సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు.

క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్

కొత్తపల్లి: తెలంగాణ ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు కొత్తపల్లి మండలంలోని భూనీడు జూనియర్ కళాశాల విద్యార్థుల తల్లిదండ్రులతో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ప్రసన్నరాణి, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని కోరారు. అలాగే విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతి రోజు చదువుకునే విధంగా పర్యవేక్షించాలని, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్, ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమిక్ హెల్ప్ ప్రోగ్రాం, మాదక ద్రవ్యాలకు సంబంధించిన అంశాల గురించి వివరించారు. భవిష్యత్‌లో ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ప్రాధాన్యత గురించి తెలియజేశారు. నూతనంగా ఏర్పడిన కళాశాలకు మంచి పేరు తీసుక రావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, భాస్కర్, తిరుపతయ్య, సంజీవ్, మల్లేశ్, హేమలత, ఆస్పియాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భూనీడు కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరాణి

దామరగిద్దలో వైద్య శిబిరం

దామరగిద్ద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్ (ఎస్ఎన్ఎస్‌పీఏ) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య నిపుణులతో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇన్‌చార్జి వైద్యుడు సోయెల్ సమక్షంలో డెంటల్, సైక్రియాట్రిస్ట్ వైద్యులతో రోగులకు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మెటర్నల్ హెల్త్ అండ్ న్యూట్రీషన్ (ఎంహెచ్ఎన్) ప్రోగ్రాం ఆఫీసర్ సుదేష్ణ మాట్లాడుతూ వైద్య శిబిరంలో 103 మందికి పరీక్షలు నిర్వహించగా.. ఇద్దరిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిపారు. వచ్చే నెల 1న చర్మ వ్యాధి నిపుణులు, జనరల్ ఫిజిషియన్ల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తామన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం



నారాయణపేటలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఎలిగండ్లలో..

సాక్షి, నెట్‌వర్క్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

■ నారాయణపేట జిల్లా కేంద్రంలోని చౌక్ బజార్ చౌరస్తాలో శుక్రవారం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయిలు, బ్యాంక్ శేషు, రాజు, నరేష్, అశోక్, మోహన్, బాలప్ప, ఆదిత్య, రఘు, వెంకట్రాములు, లోకేష్, బాలరాజు పాల్గొన్నారు.

■ మరికల్ మండలంలోని ఎలిగండ్లలో రజక సంఘం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులలర్పించారు.

■ ధన్వాడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఐలమ్మ విగ్రహ స్థలం వద్ద రజక సంఘం ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీ నాయకులు, గ్రామస్తులు ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నర్సిములు, బాలయ్య, కొండన్న, బాలప్ప, యాదేశ్, శ్రీనివాసులు, బాలకృష్ణయ్య, కుర్మయ్య, సత్యానారాయణ, రాములు, రాంచంద్రయ్య, అమర్నాథ్, శ్రీనివాసులు, వారాహస్వామి, నర్సిములునాయుడు, సుధాకర్‌రెడ్డి, రహిమన్‌ఖాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రవాహాలతో అప్రమత్తంగా ఉండాలి



లింగాల్ చేడ్ పెద్దవాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణారావు

కొత్తపల్లి: రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వాగులు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తున్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని లింగాల్‌చేడ్ పెద్దవాగు, నిడ్జింత, భూనీడు వాగులను కొత్తపల్లి తహసీల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణారావు పరిశీలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్న వాగులను దాటే ప్రయత్నం చేయరాదని సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసించే కుటుంబాలను ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అలాగే మండలంలోని నిడ్జింత వాగు, కొత్తపల్లి భూనీడు వాగుల్లో బ్రిడ్జి నిర్మాణాలు జరుగుతున్న ప్రదేశాల్లో తాత్కాలిక వంతెనలు ఏర్పాటు చేశారు.

నీటి ప్రవాహల వద్దకు వెళ్లరాదు

కోస్గి రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు నీటి ప్రవాహలకు వద్దకు వెళ్లరాదని కోస్గి సీఐ సైదులు అన్నారు. శుక్రవారం మండలంలోని ముశ్రీఫా వాగు, బిజ్జారం వాగు, ముంగిమళ్ల కత్వ వద్ద ప్రవాహాన్ని పరిశీలించారు. వాతావరణ పరిస్థితుల కారణంగా రాబోయే 24 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అత్యవసరం అయితే తప్పా బయటకు రావద్దని సూచించారు. చేపల వేటకు వెళ్లొద్దని, వాగుల్లో చిన్నారులు ఈత కొట్టడం, సెల్ఫీలు దిగే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కరెంట్ స్తంభాలను ముట్టుకోవద్దని, వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లొద్దన్నారు. అత్యవసరమైతే 100కు డయల్ చేయాలని సూచించారు.



ముశ్రీఫా వాగును పరిశీలిస్తున్న సీఐ సైదులు

మునిగిన వరి పంట

మరికల్: మండలంలో శుక్రవారం భారీ వర్షం కురువడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వరి, పత్తి, ఇతర పంట చేళ్లలోని వర్షపు నీరు చేరి పంటలకు తీవ్ర నష్టం కలిగిచింది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి, బాధిత రైతులకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చేయాలని కోరారు.



తీలేర్ శివారులో నీట మునిగిన వరిపంట

సింగారం వాగుకు జలకళ

నారాయణపేట రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు చేరడంతో నారాయణపేట మండలంలోని సింగారం వాగు మళ్లీ జలకళ సంతరించుకుంది. ఈ వర్షాకాలంలో వరద నీరు రావడం ఇది రెండోసారి. ఆగస్టు 14న సింగారం వాగు పొంగి ప్రవహించింది. వాగు సింగారం గుండా ప్రవహించి జాజాపూర్, ఊట్కూర్ మండలంలోని తిప్రాస్‌పల్లి మీదుగా ఊట్కూర్ చెరువుకు వరద నీరు చేరుతోంది. వాగు వద్ద పలువురు సెల్ఫీలు తీసుకున్నారు.

